ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
మంగళవారం 20 ఆగస్టు 2024 | 5



నేడు జేఎన్టీయూకే ఆవిర్భావ దినోత్సవం

ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఏపీఎస్సీహెచ్ఈ ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహన్‌రావు

7లో

దివ్యాంగురాలి సమస్య తెలుసుకుంటున్న జేసీ నిషాంతి



గ్రీవెన్స్‌కు 126 అర్జీలు

అమలాపురంటౌన్, ఆగస్టు 19: సమస్యలపై వచ్చే ప్రజలకు మేమున్నామనే భరోసా కల్పించేలా అధికారులు పరిష్కార మార్గాలు చూపించాలని జాయింట్ కలెక్టర్ పి.నిషాంతి సూచించారు. నిర్దిష్ట కాలవ్యవధిలోపు సమస్యలను పరిష్కరిస్తూ అర్జీదారులలో విశ్వసనీయత పెంపొందించాలన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝన్సీరాణి, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ అర్జీదారుల నుంచి 126 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని అధికారులు జవాబుదారీతనంతో నిర్వహించాల్సిన ఆవశ్యకతను వివరించారు.పరిష్కారానికి అస్కారం లేని ఫిర్యాదులు వస్తే అందుకు గల కారణాలను ఫిర్యాదుదారులకు నేరుగా తెలియజేయాలన్నారు. ఒకే ఫిర్యాదుతో పదే పదే పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగుల వద్దకు జేసీ స్వయంగా వచ్చి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యసేవల సమన్వయ అధికారి కార్తీకరెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో కార్యనిర్వాహక ఇంజనీర్ ఎం.రవికుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు సరే.. స్థలాలేవి?

నేదునూరు జోగివారిపాలెం మహిళల ఆవేదన



'ఇళ్ల స్థల పట్టాలు ఇచ్చి ఏళ్లు గడిచిపోతున్నాయి. ఇంత వరకు స్థలం ఎక్కడ ఉందో రెవెన్యూ అధికారులు చూపించలేదు. తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. ఇళ్ల స్థల పట్టాలకు స్థలాలు చూపిస్తే ఇళ్లు నిర్మించుకుంటాం' అని నేదునూరు జోగివారిపాలెం గ్రామానికి చెందిన జోగి మౌనిక, కొప్పిశెట్టి లక్ష్మి, జోగి లక్ష్మీనాగతులసీ, కొప్పిశెట్టి నాగమణి కలెక్టరేట్‌లో అర్జీ అందించారు.



ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న జేసీ

సేంద్రియ ఉత్పత్తులతో ఆరోగ్యం సొంతం

అమలాపురంటౌన్, ఆగస్టు 19: సహజ సిద్ధంగా సేంద్రియ పద్ధతులలో పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యవంతంగా జీవించవచ్చునని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. అమలాపురంలోని గోదావరి భవన్ ఎదుట సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాల స్టాల్‌ను జేసీ ప్రారంభించారు. సేంద్రియ ఉత్పత్తులను ఆమె కొనుగోలు చేశారు. సేంద్రియ సాగు విధానాల ద్వారా పండించిన ఉత్పత్తులకు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగా మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని ఆమె పేర్కొన్నారు. ఆరోగ్యవంతంగా జీవించేందుకు ప్రతిఒక్కరూ సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. స్టాల్‌లో సేంద్రియ విధానాలతో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరలు, పప్పు దినుసులు, దేశవాళీ రకాలైన నల్లబియ్యం, బీపీటీ, 2841 ఆర్ఎన్ఆర్, 15048 తదితర రకాల బియ్యాలను స్టాల్‌లో ఉంచారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఓలేటి బోసుబాబు, డీపీఎం కె.శ్రీనివాస్, అడిషనల్ డీపీఎం సత్యనారాయణ, అప్పారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


ఆవాస కేంద్రాలు

దోమలకు ఆవాస కేంద్రాలుగా గృహాలు ఉంటున్నాయి. ఇంటిలో ఉండే పనిచేయని వస్తువులను మూలన పడివేయడం, శ్లాబులు మిద్దెలపై వేయడం, ప్లాస్టిక్ సీసాలు, డబ్బాలు అనవసరంగా పడివేయడం ఇలా నిర్లక్ష్యంగా చేసే పనులే దోమలకు ఆవాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. వాటిలో నీళ్ల చేరి నిల్వ ఉండడంతో దోమల ఉత్పత్తికి అనువుగా మారుతున్నాయి. అలాగే ఇళ్ల మధ్య ఉండే ఖాళీ స్థలాలు చిన్నసైజు కుంటలుగా మారుతున్నాయి. పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు మురుగునీరు వాటిలో నిల్వ ఉంటుంది. దీంతో దోమలు ఉత్పత్తి కేంద్రాలు తయారవుతున్నాయి.

ఇళ్లల్లో పూల కుండీల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో లార్వా ఉత్పత్తికి కేంద్రాలుగా మారుతున్నాయి. పనికిరాని టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు ఇలా ఒకటేంటి అన్నీ దోమల తయారీ ఫ్యాక్టరీలే.. ఇవన్నీ తెలిసినా చాలా మందికి వాటిని శుభ్రం చేయడం బద్ధకం.. వారానికి ఒకసారి అయినా ఇంటిని ముఖ్యంగా ఇంటి పరిసరాలను శుభ్రం చేసుకునే పని పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆదివారం సెలవు సమయాన్ని దానికి కేటాయించాలంటున్నారు..



వానాకాలం వచ్చిందంటే దోమలు విజృంభిస్తాయి..ముఖ్యంగా పగటి పూట కుట్టే దోమలు చాలా ప్రమాదకరం. తీవ్రమైన జ్వరాలకు అవే కారణం.. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ తదితర జ్వరాలు ఇప్పుడు ఎక్కువగా నమోదవుతున్నాయి. వాతావరణంలో మార్పులు కూడా జ్వరాల తీవ్రతకు కారణమవుతున్నాయి.



నాతో జాగ్రత్త.. చూడ్డానికి చిన్నదానిలా ఉన్నా నేను చేసే హాని అంతాఇంతా కాదు. ఈ మాట సరదాగా చెబుతున్నది కాదు.. నిజంగా నాతో చాలా జాగ్రత్తగా ఉండండి. చాలా జ్వరాలకు నేనే కారణం..ఇంటిలోను, ఇంటిపక్కన ఇంటి ఎదురుగా శత్రువు లాంటి నన్ను మీరే పెంచుకుంటున్నారు.... చిన్నచిన్న అజాగ్రత్తల కారణంగా అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు..

నాతో జాగ్రత్త

● (మండపేట, అంబాజీపేట)



మండపేట ఏడిద రోడ్డులో డ్రైన్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు

జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

అన్ని జ్వరాలకూ దోమలే మూలం

కనీస జాగ్రత్తలు తీసుకోలేకపోతున్న జనం

ఇల్లు శుభ్రంగా ఉంటే సగం వ్యాధులు దూరమైనట్టే..

అయినా ఇంకా నిర్లిప్తత

వాతావరణ మార్పులతో జిల్లాలో జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు, ప్రైవేటు ఆసుపత్రుల వద్ద రోగులు క్యూ కడుతున్నారు. జ్వరం, దగ్గు, జలుబుతో ఇబ్బందులు పడుతున్నారు. కొత్త నీటితో పాటు కొత్త వ్యాధులు రావడం సహజం. రోడ్లన్నీ బురదమయమై చెత్తచెదారం కుళ్లి ప్రాణాంతక వైరస్‌లు బయటపడుతున్నాయి.

మలేరియా

ఇది అనాఫిలిస్ అనే దోమ కాటు ద్వారా వస్తుంది. చలితో నిర్ణీత సమయంలో మాత్రమే జ్వరం వస్తుంది. చలి తీవ్రంగా ఉంటుంది. పది రోజుల నుంచి పదిహేను రోజుల వరకు జ్వరం తగ్గదు. రక్తపరీక్ష ద్వారా నిర్ధారణ చేసుకోవచ్చు. క్లోరోక్విన్ అనే మందులను వాడటం ద్వారా వ్యాధిని నివారించుకోవచ్చు.

చికున్‌గున్యా..

ఇది కూడా దోమ కాటు వలన వస్తుంది. జ్వరం 102 డిగ్రీల వరకూ వస్తుంది. దాదాపు 10 రోజుల వరకు జ్వరం ఉంటుంది. కండరాలు పట్టుకుపోతాయి. వంటి నొప్పులు ఎక్కువగా ఉంటాయి. పారాసిటమల్ వేసుకుని రోగి విశ్రాంతి తీసుకుంటే కోలుకొంటారు.



డెంగ్యూ..

ఏజిప్టి ఏడిస్ అనే దోమ కారణంగా డెంగ్యూ వస్తుంది. ఇవి పగలు మాత్రమే కుడతాయి. ఇంటి ఆవరణలో మంచినీరు నిల్వ ఉన్న దగ్గర లార్వాలు తగ్గుతాయి. 104 డిగ్రీల జ్వరం, వణికించే చలి, ఒళ్లు నొప్పులు, తీవ్రమైన కండరాల నొప్పులు, నీరసం అయిపోవడం, విపరీతమైన తలనొప్పి, శోషగ్రంధులువాపు, చంకల్లో ఉన్న నరాలు వాయడం. కంటి వెనుక ఉన్న భాగం మొత్తం ఎర్రబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ప్లేట్‌లెట్ల సంఖ్య తగ్గిపోతుంది. ఆరోగ్యవంతుల్లో లక్షా అరవై వేల వరకు ఈ సంఖ్య ఉంటుంది. డెంగ్యూ బారిన పడిన వారు విశ్రాంతి తీసుకోవాలి. నిర్ధారణకు ఎలీసా అనే టెస్టు చేయించుకోవాలి. 50వేల కంటే ప్లేట్‌లెట్స్ తగ్గిపోతే వాటిని రోగి శరీరంలోకి ఎక్కించాలి.



టైఫాయిడ్

టైఫాయిడ్... కలుషిత నీటి ద్వారా వస్తుంది. టైఫోజా అనే బ్యాక్టరీయా కారణం. టైఫాయిడ్ వ్యాధి ఉన్న వ్యక్తి మల, మూత్రాలు ద్వారా గానీ, ఆహారం ద్వారా గానీ ఆరోగ్యంగా ఉన్న వారికి వ్యాప్తి చెందుతుంది. మొదటి రెండు రోజుల తక్కువగానే ఉన్న శరీరం ఉష్ణోగ్రతలు మూడోరోజు నుంచే తీవ్ర రూపం దాలుస్తాయి దీని వల్ల బాధితుడు తీవ్రంగా నీరసించిపోతాడు. వైద్యుని సంప్రదించి వారం రోజుల యాంటీబయాటిక్స్ వాడితే వ్యాధి తగ్గిపోతుంది.




మండపేటలో అధ్వానంగా టిడ్కో సముదాయం



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణారావు

పోలీస్ గ్రీవెన్స్‌కు 18 అర్జీలు

అమలాపురంటౌన్, ఆగస్టు 19: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 18 అర్జీలను ఆయన స్వీకరించారు. చట్ట నిబంధనలకు లోబడి సమస్యలను పరిష్కరించాలని ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులకు ఆయన సూచించారు.



శ్రావణ పౌర్ణమి సందర్భంగా మండపేట పట్టణంలో శ్రీబాలాత్రిపురసుందరీదేవిని లక్ష గాజులతో అలంకరించారు. మండపేట

గండం గడిచినా నష్టం తప్పదా?

వానపల్లిపాలెంలో ముంపు నుంచి బయటపడుతున్న సార్వా పొలం



కూనవరం మొగ పునరుద్ధరణతో పీకల్లోతు నీటిలో వారాల తరబడి ఉన్న పైరు ఇప్పుడిప్పుడే బయట పడి ఊపిరి పీల్చుకుంటోంది. అయితే ఎక్కువ రోజులు నీటిలో నానడంతో సార్వా పైరు జవసత్వాలు కోల్పోయి బలహీనపడింది. కొన్ని ప్రాంతాల్లో పైరు నల్లగా మారింది. ముంపునీరు దిగేందుకు ఆదిలోనే అధికారులు కూనవరం మొగను తవ్వి ఉంటే పైరుకు ఇంతగా నష్టం జరిగేది కాదని రైతులు వాపోతున్నారు. జూలై నెలలో జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలో 25,000 ఎకరాల విస్తీర్ణంలోని సార్వా నాట్లు ముంపు బారిన పడ్డాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. దీంతో నాటిన పైరుకు సకాలంలో ఎరువు అందలేదు. మిగిలిన విస్తీర్ణంలో నాట్లు నిలిచిపోయాయి. ప్రస్తుతం మొగ ద్వారా ముంపునీరు బయటకు పోతుండటంతో క్రమంగా పొలాలు ముంపు నుంచి కోలుకుంటున్నాయి. మెరక ప్రాంతాల్లో పైరు పరిస్థితి ఎంతోకొంత మెరుగ్గా ఉంది. పల్లపు ప్రాంతాల్లో మాత్రం సార్వా నాట్లు రంగుమారి బలహీన పడ్డాయి. ఎక్కువ కాలం నీటిలో ఉన్నందున పైరు దుబ్బు చెయ్యలేదు. వేసిన నాట్లు వేసినట్టుగానే ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

● ఉప్పలగుప్తం

రంగు మారిన సార్వా మూనలు

పల్లపు ప్రాంతాల్లో కుళ్లు తెగులు బెడద

దుబ్బు చేసే అవకాశముండదని బెంగ

నష్టాలు తప్పవని రైతుల ఆందోళన

కుళ్లు తెగులు భయం

పల్లపు ప్రాంతాల్లో కుళ్లు తెగులు బెడద ఏర్పడినట్టు రైతులు అంటున్నారు. పైరు పిలకలు తొడగాలంటే పొలం తడిపొడిగా ఉండి, తగినంత ఎరువు అందాలి. తగిన సమయంలో పైరుకు ఎరువు అందలేదు. సాధారణంగా నారు దశ నుంచి 75రోజుల వ్యవధిలోగా పైరుకు ఎరువు అందించడం పూర్తికావాలి. ఈ కారణంగా తక్షణమే పైరుకు ఎరువు అందించాలని వ్యవసాయశాఖ సూచిస్తోంది. ముంపు నుంచి బయట పడిన పైరు రక్షణ కోసం వ్యవసాయశాఖ సూచనలను రైతులు విధిగా పాటిస్తే ప్రయోజనముంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ముంపు సమయంలో పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు ముంపు అనంతరం తీసుకోవలసిన జాగ్రత్తలను ముందుగానే రైతులకు వివరించారు. దీంతో పాటు కుళ్లు తెగులు నివారణ చర్యలపై వ్యవసాయాధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా సార్వా దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదముందని రైతులు భయపడుతున్నారు.



ముంపులో వరి పొలాలు (ఫైల్)

నేను..నీకు రక్ష



ఆలమూరు సిద్ధార్థ పాఠశాలలో..

అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. రాఖీలు కట్టుకుని ఆనందాలను పంచుకున్నారు..

వార్తలు..8వ పేజీలో



అమలాపురంలో ఎంపీ హరీష్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



అవినీటి..పారుదల!?

- ఇరిగేషన్ శాఖలో గత ఐదేళ్లుగా ఇంతే
- అదనపు బాధ్యతలతో దోపిడీ
- అందరూ అదనపు చార్జ్‌లే
- వీరిలో డెల్టా సీఈ నుంచి ఎస్ఈ, డివిజన్ ఈఈలు
- ఎవరికి వారే అన్నచందంగా డివిజన్ల తీరు
- పదవీ విరమణ చేయించాల్సిన ఎన్ఎంఆర్ ఉద్యోగికి 8 నెలలుగా జీతం
- పట్టించుకోని హెడ్‌వర్క్స్ ఈఈ, ఎస్ఈకి ఫిర్యాదు అందడంతో వెలుగులోకి

ధవళేశ్వరం, ఆగస్టు19: కలెక్టరమ్మా కాస్త ఇటు చూడమ్మా.. ధవళేశ్వరం నీటి పారుదలశాఖపై దృష్టి పెట్టమ్మా.. అక్కడ జరిగే దారుణాలు అన్నీ ఇన్నీ కావు.. బ్రిటీష్ వాళ్లు నిర్మించిన భవనాలమాటున ఎన్నో అకృత్యాలు సాగుతున్నాయి. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్నా నేటికీ మార్పు లేదు.. అధికారులకు నచ్చినచోట.. ఇష్టం వచ్చినట్టు దోచుకుంటూ అవినీటి పారుదల శాఖగా మార్చేశారు. దీనిలో భాగంగా సొమ్ములు వచ్చే సీట్లను ఎంచుకుని ధవళేశ్వరం నీటి పారుదలశాఖలో అడిషనల్ చార్జిలుగా కొన సాగుతున్నారు. ఒక్కసారి లెక్క తీస్తే గత ప్రభుత్వ హయాంలో మంత్రులను, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని అదనపు ఆదాయానికి అదనపు సీటులో కూర్చున్న వారే అధికం. డెల్టా సీఈ నుంచి ఎస్ఈ, డివిజన్ ఈఈలు అందరూ అదనపు చార్జ్‌లతో కొనసాగుతున్నవారే. తూర్పు డెల్టా, మధ్యడెల్టా వైఐ డివిజన్లతోపాటు సర్కిల్ కార్యాలయంలోని డిప్యూటీ ఎస్ఈ, ఆఫీసర్ అండ్ టెక్నికల్ (ఓటీ)వంటి పోస్టుల్లో ఉన్న ఉద్యోగులందరూ అదనపు బాధ్యతలు చేపట్టినవారే. అదనపు బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వర్తించాల్సిన అధికారులు ఆయా డివిజన్లను పూర్తిస్థాయిలో పట్టించుకోకుండా కాసులు వచ్చే పనులపైనే దృష్టి సారిస్తున్నారు. దీంతో ఆయా శాఖల ఉద్యోగులు కూడా సమయపాలన పాటించకపోవడం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజం చేస్తున్న సంఘటనలు బయటపడుతున్నాయి. దానికి ఈ కింద సంఘటనే ఉదాహరణ.

ఎస్ఈకి ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి

సదరు ఎన్ఎంఆర్ ఉద్యోగి విషయంలో ఉద్యోగ విరమణ చేయించకుండా సొమ్ములు తీసుకుని రికార్డుల్లో వయసు మార్చి ఉద్యోగంలో కొనసాగిస్తూ 8 నెలలుగా జీతం చెల్లిస్తున్నారని సర్కిల్ ఎస్ఈకి ఫిర్యాదు అందడంతో హెడ్‌వర్క్స్ ఈఈని వివరణ కోరారు. రికార్డులు పరిశీలించి 2023 మేలోనే సదరు ఉద్యోగిని విరమణ చేయించాల్సి ఉందని గుర్తించారు. నిబంధనల మేరకు ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేయించినా ఉద్యోగ విరమణ తరువాత అతడికి ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాట్యుటీ, పించన్ వంటివి ఉండకపోవడంతో గత 8 నెలలుగా ప్రభుత్వ ఖజానా నుంచి చెల్లించిన జీతం ఏ విధంగా రాబట్టాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. వీరి నిర్లక్ష్యానికి చెల్లించిన జీతం హెడ్‌వర్క్స్ డివిజన్‌లోని సంబంధిత ఉద్యోగుల నుంచి రాబట్టాలా, లేక డివిజన్ ఈఈ భరిస్తారా లేకుంటే మసిపూసి మారేడుకాయ చేస్తారనేది సర్కిల్ ఎస్ఈకే తెలియాలి.

పదవీ విరమణ చేయాల్సిన ఉద్యోగికి 8 నెలలుగా జీతం

2010వ సంవత్సరంలో కొందరు ఎన్ఎంఆర్ ఉద్యోగులుగా కోర్టు ఆర్డరుతో హెడ్ వర్క్స్ డివిజన్‌లో విధుల్లో చేరారు. ఆ సమయంలో తమ వయసును నిర్ధారించే పత్రాలు అందజేశారు. వారిలో కొందరి వయసు నిండడంతో 2023 మే, జూన్‌లలో ఉద్యోగ విరమణ చేశారు. అప్పట్లోనే ఉద్యోగ విరమణ చేయాల్సిన వ్యక్తి హెడ్ వర్క్స్ సెక్షన్‌లో కాటన్ మ్యూజియంలో విధులు నిర్వహిస్తూ గత 8 నెలలుగా ఎటువంటి ఆటంకం లేకుండా జీతం పొందుతున్నాడు. హెడ్‌వర్క్స్ ఈఈ నిర్లక్ష్య వైఖరితోపాటు సంబంధిత సెక్షన్ ఉద్యోగులు పట్టించుకోకపోవడంతోనే ఉద్యోగ విరమణ చేయించాల్సిన వ్యక్తికి 8 నెలలుగా జీతం చెల్లిస్తున్నారని ఉద్యోగ వర్గాల్లోనే విమర్శలు వినిపిస్తున్నాయి





శ్రీపాదశ్రీవల్లభుడికి, ఔదంబర వృక్షానికి రాఖీ కడుతున్న భక్తులు

దత్తక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

- పిఠాపురంలో ఆలయాలకు శ్రావణి(రాఖీ)పౌర్ణమి శోభ
- శ్రీపాదుడు, ఔదంబర వృక్షానికి రాఖీదారణ



ప్రత్యేక అలంకారంలో శ్రీపాదశ్రీవల్లభుడు

పిఠాపురం, ఆగస్టు 19: దత్తక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ ఆలయాలు, రహదారులు భక్తజనంతో కిటకిటలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీపాదుడు, ఔదంబర వృక్షాలకు భక్తులు రాఖీలు కట్టారు. పిఠాపురంలోని దత్తక్షేత్రాలకు సోమవారం శ్రావణ పౌర్ణమి శోభ చేకూరింది. శ్రావణ(రాఖీ లేదా జంధ్యాల) పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీపాదవల్లభ మహా సంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుడిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మహారాష్ట్ర, కర్నాటక, గుజరాత్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, పశ్చిబెంగాల్‌తోపాటు ఉభయ తెలుగురాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పరిసరాలన్ని భక్తజనసంద్రమయ్యాయి. శ్రీపాదశ్రీవల్లభస్వామికి మహిళలచే రాఖీదారణ జరిగింది. దత్త స్వరూపంగా భావించే ఔదంబర వృక్షానికి రాఖీలు కట్టారు. వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారు శ్రీపాదశ్రీవల్లభులకు రాఖీ కట్టిన పవిత్రదినం కావడంతో మహిళా భక్తులు రాఖీ కట్టేందుకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. స్వామికి మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, హోమం, అభిషేకాలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సౌజన్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాఖీ ఆనందం క్షణాల్లో ఆవిరి!?

- అమ్మను కబళించిన మృత్యువు



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు





ప్రమాదంలో మృతిచెందిన సత్యవేణి



లారీ డ్రైవర్‌ను కట్టేసిన దృశ్యం

రాజమహేంద్రవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాఖీ పండుగ ఆ కుటుంబంలో అంతులేని శోకాన్ని మిగిల్చింది. కూతురిని తీసుకొని కొడుకు వద్దకు వెళ్లి రాఖీ కట్టించిన ఆనందం క్షణాల్లో ఆవిరైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా కొత్తపేటలోని సంతోష్‌నగర్‌కి చెందిన కనకాల అమ్మిరాజు, సత్యవేణి దంపతులకు ఇద్దరు పిల్లలు. కొడుకు శ్రీరామ్ రాజమహేంద్రవరం శివారు కాతేరులోని తిరుమల కళాశాలలో జూనియర్ ఇంటర్ చదువుతున్నాడు. సోమవారం రాఖీ పౌర్ణమి కావడంతో కూతురు వైష్ణవి, అన్నయ్య గుర్రాల దుర్గారావుతో కలిసి తిరుమల కళాశాలకు వెళ్లారు. తమ్ముడు శ్రీరామ్‌కి వైష్ణవి రాఖీ కట్టింది. అందరూ కలిసి భోజనం చేసి కాసేపు ఆనందంగా గడిపారు. మధ్యాహ్నం 3.30సమయంలో తిరుగు ప్రయాణమయ్యారు. కళాశాలకు కొద్ది దూరంలో వంతెనపై వెళ్తుండగా ఒడిశా నుంచి పేపర్ మిల్లుకు కర్రల లోడుతో వస్తున్న వ్యాను వీరి బైక్‌ని బలంగా ఢీకొంది. వ్యాన్ డ్రైవరు చబుద్రప్రధాన్ తాగిన మైకంలో దారి తప్పడంతో పేపర్‌మిల్లు దాటిపోయి సుమారు 3 కిలోమీటర్లకుపైగా వెళ్లిపోయాడు. అదే సమయంలో రాజమహేంద్రవరం వైపు ఆ ముగ్గురూ బైక్‌పై వస్తున్నారు. వంతెన పైకి రాగానే కుడివైపు వెళ్తున్న వ్యాన్‌ని మద్యం మత్తులో ఎడమ వైపునకు అకస్మాత్తుగా తిప్పడంతో బైక్‌ని బలంగా ఢీకొంది. దీంతో బైక్ వెనుక చివరన కూర్చున సత్యవేణి వెనక్కి పడిపోవడంతో తలకు వంతెన సిమెంటు ప్లాట్‌ఫాం బలంగా తగిలి తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందింది. వైష్ణవి, దుర్గారావుకు తీవ్రంగా గాయాలయ్యాయి. వారిని తొలుత ప్రభుత్వాస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సంఘటన జరిగిన తర్వాత స్థానికులు పరుగుపరుగున అక్కడికి చేరుకున్నారు. వారిలో ఒకరు 108కి ఫోన్ చేశారు. అయితే ధవళేశ్వరం నుంచి వచ్చే వాహనం లేదని.. రాజానగరం నుంచి పంపిస్తామని చెప్పారు. ఫోన్‌లు చేసినా ఫలితం లేదు. ఈలోపు ఆటోలో ఆస్పత్రికి తరలించడానికి సన్నద్ధమవుతుండగా.. అరగంట దాటిన తర్వాత 108 వచ్చింది. అప్పటికే వైష్ణవి తలకు బలమైన గాయం కావడంతో రక్తమోడుతూ దాదాపుగా స్పృహ కోల్పోయింది. దీంతో స్థానికులు 108పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వాహనం ఆలస్యం వల్లనే వైష్ణవి పరిస్థితి విషమంగా మారిందని ఆవేదన చెందారు. వ్యాన్ డ్రైవర్ చబుద్రప్రధాన్ నిర్లక్ష్యమని ప్రాథమికంగా గుర్తించి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని సీఐ అప్పారావు తెలిపారు.

'ఆదిత్య'లో వృక్షాబంధన్



చెట్టుకు రాఖీ కడుతున్న దృశ్యం

గండేపల్లి, ఆగస్టు 19: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో హరిత ఎకో క్లబ్ వారు వృక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవిశంకర్ మాట్లాడుతూ ప్రతీఒక్కరూ ఒక వృక్షాన్ని దత్తత తీసుకుని ఆ వృక్షాన్ని కాపాడడం, కొత్తగా మొక్కలు నాటడం వంటివి చేయడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలన్నారు. అనంతరం కాలేజీ ఆవరణలో, వెంకటాపురం గ్రామంలో జడ్పీ హైస్కూల్ నందు పిల్లలతో చెట్టుకు రక్షాబంధం కట్టించారు.

రాఖీ కట్టిన అక్కకు తమ్ముడు డైమండ్ చెవి దిద్దులు కానుక



పేరవరంలో అక్కకు డైమాండ్ రింగ్‌ను బహూకరిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 19: ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన దాసరి సూర్యతేజ రాఖీ పౌర్ణమి సందర్భంగా తన అక్క కావ్యకు ఖరీదైన బహుమతి ఇచ్చాడు. ఇంజనీరింగ్ పూర్తిచేసి ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న సూర్యతేజ సోమవారం హైదరాబాద్‌లో ఉంటున్న తన అక్క కావ్య దగ్గరకు వెళ్లి రాఖీ కట్టించుకుని అనంతరం సుమారు రూ.లక్షా 30 వేలు విలువచేసే డైమండ్ చెవి దిద్దులను కానుకగా ఇచ్చాడు. తమ్ముడు బహుమతినిచూసి అక్క ఆనందానికి అవధులులేవు. తమ్ముడికి కావ్య రూ.14వేల వాచీని బహుమతిగా ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

నేడు జేఎన్టీయూకే 16వ ఆవిర్భావ దినోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఏపీఎస్సీహెచ్ఈ ఇన్‌ఛార్జి చైర్మన్ రామ్మోహన్‌రావు
- కృష్ణతేజ, రామకృష్ణలకు యంగ్ అఛీవర్స్ అవార్డుల ప్రదానం

జేఎన్టీయూకే, ఆగస్టు19: కాకినాడ జేఎన్టీయూకే 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్జీ మురళీకృష్ణ తెలిపారు. వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం వర్సిటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఇన్‌ఛార్జి చైర్మన్ కె.రామ్మోహన్‌రావు, గౌరవఅతిథిగా కాకినాడ సీపోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో మెర్ల మురళీధర్ పాల్గొంటున్నారన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు అవార్డులను అందజేస్తామని తెలిపారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరెక్టర్, డిప్యూటీ సీఎం ఓఎస్డీ ఎంవీఆర్ కృష్ణతేజ, ప్రొవిజన్స్ లాజిస్టిక్స్ ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణలకు యంగ్ అఛీవర్స్ అవార్డులను ప్రదానం చేయనున్నామన్నారు. ఈ వేడుకలకు మాజీ ఉపకులపతులు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు, పూర్వవిద్యార్థులను ఆహ్వానించామని తెలిపారు. సమావేశంలో రెక్టార్ కేవీ రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జగ్గంపేట జగనన్న కాలనీలో ఇద్దరు అనుమానాస్పద మృతి

- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు



జగ్గంపేటలో ఒకే గదిలో ఇద్దరు ఉరేసుకుని మృతి చెందిన దృశ్యం

జగ్గంపేట, ఆగస్టు 19: కాకినాడ జిల్లా జగ్గంపేట జగనన్న కాలనీలో సోమవారం సాయంత్రం ఇద్దరు ఉరేసుకుని మృతిచెందిన సంఘటన జరిగింది. జగ్గంపేట పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ రఘునాధరావు, ఏఎస్ఐ నూకరాజు సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం... గత మూడేళ్లుగా జగనన్నకాలనీలో ఒక ఇల్లు అద్దెకి తీసుకుని రంగంపేటకు చెందిన వివాహిత అన్నాబత్తుల ప్రసన్న అద్దెకు ఉంటుంది. అదే విధంగా జగ్గంపేటకు చెందిన యువకుడు నాని (25) ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఇద్దరి మధ్య కలహాలు రావడంతో సోమవారం సాయంత్రం ఆమె ఉరేసుకోగా అది చూసి తట్టుకోలేక అతను కూడా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు స్థానికులు తెలియజేశారు. దీనిపై ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పవన్ నివాసం వద్ద జనవాణి

- జిల్లాలు నుంచి తరలివచ్చిన ప్రజలు



జనవాణి కార్యక్రమంలో వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 19: కాకినాడజిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు బైపాస్‌రోడ్డులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం వద్ద సోమవారం జనవాణి కార్యక్రమం నిర్వహించారు. జనవాణిలో తమ సమస్యలు విన్నవించుకునేందుకు పిఠాపురం నియోజకవర్గంతో పాటు వివిధ జిల్లాలు నుంచి ప్రజలు తరలివచ్చారు. అక్కడ ప్రత్యేకంగా నియమించిన సిబ్బంది వారి సమస్యలు తెలుసుకుని వినతులు స్వీకరించారు. వీటిని పరిష్కారం నిమిత్తం డిప్యూటీ సీఎం కార్యాలయం ద్వారా ఆయా శాఖల అధికారులకు పంపనున్నారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలతో పాటు అర్హతఉన్నా పింఛన్లు అందకపోవడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోసం, వైద్య సహాయంఅంశాల్లో ఎక్కువగా వినతులు వచ్చాయి. తన ఇంటిని నాలుగు సంవత్సరాల క్రితం అద్దెకు ఇచ్చానని, వారు అద్దె ఇవ్వకపోగా తనను ఇంటి నుంచి గెంటి వేశారని మచిలీపట్టణంలోని నిజాంపేట ప్రాంతానికి చెందిన మహిళ కేదారేశ్వరీ జనవాణిలో ఫిర్యాదు చేసింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం, పోలీసుల అండ చూసుకుని ఇంటి నుంచి గెంటివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు పోలీసులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం చేయకపోగా, తనకు మానసికస్థితి సరిగాలేదంటూ ముద్రవేశారని తెలిపారు. తనకు న్యాయం చేయాలని విన్నవించారు. పవన్‌కల్యాణ్‌కు సమస్య విన్నవించుకుంటే సమస్య పరిష్కారమవుతుందని చెప్పారని,అందుకే ఇక్కడకు వచ్చినట్లు చెప్పారు.

అమెరికా హానర్‌కు ఫొటోగ్రాఫర్ అభిరామ్ ఎంపిక

రాజానగరం, ఆగస్టు 19: వరల్డ్ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఇమేజ్ కొలీగ్ సొసైటీ అమెరికా(ఐసీఎస్) ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా 28 మంది ఫొటో గ్రాఫర్లకు గౌరవ హానర్‌లు ప్రకటించిందని, దీనిలో మన దేశం నుంచి 11మందికి గానూ, తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిలో తెలంగాణ నుంచి నలుగురు, ఆంధ్రప్రదేశ్ నుంచి హానర్‌కు తనను ఎంపిక చేసినట్టు ఫొటో గ్రాఫర్ అభిరామ్ తెలిపారు. రాజానగరం మండలం కొత్తతుంగ పాడు గ్రామానికి చెందిన గొల్లపల్లి అభిరామ్ చదువుకునే రోజుల్లో ఫొటోగ్రఫీపై ఉన్న మక్కువతో తొలిసారిగా 1998లో ఫొటోగ్రఫీ వృత్తిలోకి ప్రవేశించాడు. అప్పటి నుంచి నేటి వరకు వివిధ ఫొటోగ్రఫీ వర్క్‌షాప్‌లలో పాల్గొని 42 ఫొటోగ్రఫీ అవార్డులు సాధించినట్టు చెప్పారు. హానర్ రావడానికి సహకరించిన పటాన్ హుస్సేన్‌ఖాన్, తుమ్మా శ్రీనివాస్‌రెడ్డి, సమీర్ మధుకర్ మోహితేకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు డిసెంబర్ 1న విజయవాడ బాలోత్సావ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో హానర్ అందుకోనున్నట్టు అభిరామ్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఫొటోగ్రాఫర్లు ఆయనకు అభినందనలు తెలియజేశారు.



అవార్డులు తెచ్చిపెట్టిన అభిరామ్ అపురూప చిత్రం

విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి

- కోలమూరులో గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుండగా ఘటన

రాజానగరం, ఆగస్టు 19: రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో కొంతమూరులోని ఎస్‌వీబీ లేఅవుట్‌లో విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి చెందినట్టు రాజానగరం సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ సోమవారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన కొక్కిరిపాటి రాజు(55) గౌరీపట్నం క్వారీ నుంచి గ్రావెల్ లోడు చేసుకుని రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు చేరుకున్నాడు. స్థానిక ఎస్‌వీబీ లేఅవుట్‌లో ఆదివారంరాత్రి 7.30 సమయంలో గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుండగా పైనున్న విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై డ్రైవర్ రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. మృతుడి అల్లుడు ఉండ్రాజవరం మండలం సూర్యారావుపాలేనికి చెందిన ఉండ్రాజవరపు పాపారావు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తునిరూరల్, ఆగస్టు 19: 16వనెంబరు జాతీయ రహదారిపై రోడ్డుప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరులో జరిగింది. ఎర్రకోనేరు జంక్షన్‌లో ఓ హోటల్‌ఎదురుగా రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న సుమారు 35ఏళ్ల వయస్సుగల వ్యక్తిని తుని నుంచి అన్నవరం వైపుగా వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి.స్థానికుల సమాచారంతో రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికిచేరుకుని ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించే సమయంలో వ్యక్తిప్రాణాలు వదిలాడు. మృతుడి వివరాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రిలో ఉంచారు. మృతుడి బంధువులు రూరల్ పోలీసులను సంప్రదించాలన్నారు.

కారులో గంజాయి రవాణా

- 25 కిలోలు స్వాధీనం.. ఏడుగురి అరెస్టు
- చోరీ కేసుల్లోని రూ.11,81,000 విలువైన సొత్తు రికవరీ



గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కొవ్వూరు, ఆగస్టు 19: గంజాయి రవాణాచేస్తున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 25.130కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. సోమవారం కొవ్వూరు పట్టణ పోలీస్టేషన్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలీసులకు అందిన సమాచారం మేరకు సోమవారం ఎస్ఐ కె.జగన్మోహన్, లీగల్ మెట్రాలజి అధికారులు, రెవెన్యూ సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. కొవ్వూరు టోల్‌గేట్ సమీపంలో సర్వీస్‌రోడ్‌లో మారుతి కారు అనుమానాస్పదంగా వస్తుండడంతో ఆపి తనిఖీ చేశారు. కొవ్వూరు కోట్ల వారి వీధికి చెందిన రౌడీషీటర్ కంచుబాణి దినకర్, ఇందిరమ్మకాలనీకి చెందిన భూపతి అశోక్, భూపతి అశ్వర్థ, దొమ్మేరు సావరం గ్రామానికి చెందిన కడింపల్లి సిద్ధార్థ, దేవరపల్లి మండలం యర్నగూడెం పాతపేటకు చెందిన గీసాల రవికుమార్, కొరివేటి పోసికుమార్, పోలవరం హైస్కూల్ రోడ్డుకు చెందిన చెట్టేబత్తుల హర్షవర్దన్‌లు అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల గ్రామంలో కొనుగోలు చేసి కారులో రెండు బ్యాగ్‌లుగా పార్సిల్ చేసి తీసుకువస్తున్న 25.130 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీని విలువ రూ.75 వేలు ఉంటుందన్నారు. దీనిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టామన్నారు. ఈ విచారణ అనంతరం కొవ్వూరు, రాజానగరం, దేవరపల్లి పోలీసుస్టేషన్ల పరిధిలో జరిగిన ఐదు దొంగతనాలకు సంబంధించిన ఆస్తిని రికవరీ చేశామని సీఐ చెప్పారు. 2024 జూన్ నుంచి జూలై 17 వరకూ కొవ్వూరు, దొమ్మేరులోని జగనన్నకాలనీ, దేవరపల్లి మండలం కృష్ణంపాలెం, గౌరీపట్నం, రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరులో జరిగిన చోరీ కేసుల్లోని రూ.11,81,000 విలువైన వస్తువులను రికవరీ చేసినట్టు చెప్పారు. గంజాయి రవాణాతో పాటు ఈ ఐదు కేసుల్లో ఏడుగురు నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ విశ్వం తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో కేంద్ర మాజీ మంత్రి పూజలు

అన్నవరం, ఆగస్టు 19: సత్యదేవుడి సన్నిధిలో సోమవారం కేంద్ర మాజీ మంత్రి, సింహాచలం దేవస్థానం చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలకగా వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం సత్యగిరి కొండపై నిర్మాణాలైన వేదపాఠశాల శివసదన్ కాటేజీ, ఉచితకల్యాణమండపాలను పరిశీలించారు. ఆయన వెంట సహాయకమిషనర్ విశ్వనాధరాజు, పీఆర్వో కృష్ణారావుగ, తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌గజపతిరాజుకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

గంజాయి కేసులో విలేకరుల అరెస్టు ఓ కుట్ర

- ఛత్తీస్‌గఢ్ మాజీ మంత్రులు మోహన్, కవాసి



విలేకరులతో మాట్లాడుతున్న ఛత్తీస్‌గఢ్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్ గఢ్‌కి చెందిన నలుగురు పాత్రికేయులను గంజాయి కేసులో అరెస్టు చేయడం వెనుక బీజేపీ కుట్ర ఉందని ఛత్తీస్‌గఢ్ మాజీ మంత్రి మోహన్ మార్కవన్, మరో మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే కవాసి లఖ్మ ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న నలుగురు పాత్రికేయులను ఆ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మార్కవన్, లఖ్మ, సిట్టింగ్ ఎమ్మెల్యే విక్రమ్ మాండవి, మాజీ ఎమ్మెల్యే రేఖ్‌చంద్ జైన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వరి భాగేల్, జడ్పీ చైర్మన్ హరీశ్‌కవాసి ములాఖత్‌పై సోమవారం కలిశారు. అనంతరం జైలు బయట వారు మాట్లాడుతూ.. ఛత్తీస్‌గఢ్- ఆంధ్రా సరిహద్దులో అక్రమంగా ఇసుక తవ్వుతున్న కాంట్రాక్టర్లను ఆ నలుగురు విలేకరులు వెళ్లి ప్రశ్నించారన్నారు. వాళ్లకి ఆ కాంట్రాక్టర్లు మంచి మాటలు చెప్పి భోజనానికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ముందుగా వేసిన ప్లాన్ ప్రకారం భోజనం చేస్తుండగా వారి కారులో దొంగ తనంగా గంజాయిని ఉంచారని చెప్పారు. ఈ విషయం తెలియని విలేకరులు ఆ కారులో ఆంధ్రాలో ప్రవేశించగానే పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. ఈనెల 11న సీజీ 18 ఎల్ 0698 నంబరు కలిగిన కారును చింతూరు పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా సోదా చేశారు. కారులో 3 ప్యాకెట్లలో 15కి లోల గంజాయి ఉన్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కారులో ఉన్న దంతెవాడజిల్లా దక్షిణ బస్తర్‌కి చెందిన బప్పిరే(ఏ3), అదే జిల్లాలోని రాంపూర్ క్యాంప్‌కి చెందిన శివేందు త్రివేది(ఏ4), సుకుమా జిల్లా నకపర వార్డుకు చెందిన ధర్మేంద్రసింగ్(ఏ5), అదే జిల్లా కుంటకు చెందిన మనీష్‌సింగ్ అనే విలేకరులను అరెస్టు చేశారన్నారు. క్రైం నెం.62/2024 అండర్ సెక్షన్ 8(సీ) రెడ్ విత్ (బీ)(2) (బీ) ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. కోర్టు ఆదేశాలతో నిందితులను సెంట్రల్ జైలుకు తరలించినట్టు పేర్కొన్నారు. విలేకరులను కేసులో ఇరికించడానికి కారులో గంజాయిని ఉంచారని అక్కడి సీసీ కెమెరాల ద్వారా స్పష్టమైనట్లు తెలుస్తోందన్నారు. కారులో గంజాయి పెట్టారని భావిస్తున్న కుంటకు చెందిన ఇర్షాద్, పవన్ లను కేసు నమోదులో ఏ1, ఏ2లుగా పేర్కొన్నారన్నారు. వీళ్ల కోసం గాలిస్తున్నారు. సీసీ ఫుటేజీలను మాయం చేసిన ఛత్తీస్‌గఢ్ ఎస్ఐని అక్కడి పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సుమారు 20 మందితో కూడిన కాంగ్రెస్ బృందం జైలుకు వచ్చి విలేకరులకు భరోసా ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకొంది. వారికి బెయిల్ విషయంలో సహాయం చేస్తామన్నారు. అధికార బీజేపీ ప్రభుత్వపాత్ర ఉందని ఆరోపించారు.

టాయిలెట్ ఫోటోలు అప్‌లోడ్‌పై విధి విధానాలు విడుదల

తొండంగి, ఆగస్టు 19: పాఠశాలల్లోని టాయిలెట్ ఫోటోలు ఎవరు తీయాలి, ఎవరు అప్‌లోడ్ చేయాలన్న దానిపై ప్రభుత్వం విధివిధానాలను విడుదల చేసింది. దీని ప్రకారం ఇకపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఐఎంఎంఎస్ యాప్‌లో టాయిలెట్ ఫోటోలను అప్‌లోడ్ చేయాల్సిన పనిలేదు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రతిరోజు సాయంత్రం సర్వే ఫారమ్ పూర్తి చేయవలసి ఉంది. దీనిలో ఆయా హాజరు, టాయిలెట్ల పరిస్థితి, రన్నింగ్ వాటర్ లభ్యత, ఎన్నిసార్లు శుభ్రపరిచారన్న వివరాలు నమోదు చేయాలి. ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతి సోమ, గురువారాలు పాఠశాలను సందర్శించి ఐఎంఎంఎస్ యాప్‌లో ఫోటోలు అప్‌లోడ్ చేయాలి. టాయిలెట్ల శుభ్రత, వాష్‌బేసిన్, యూరినల్స్ పరిస్థితి తదితర అంశాల పై రిమార్కులతో ఫోటోలు అప్‌లోడ్ చేయాలి. వీరితో పాటు విద్యాకమిటీల అధ్యక్షులు, సభ్యులు ప్రతి బుధ ,శుక్రవారాల్లో పాఠశాలలను సందర్శించి టాయిలెట్ ఫోటోలను అప్‌లోడ్ చేయాలి. వీరికి ఐఎంఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

పది వేల పెన్నులతో పూజ

మామిడికుదురు, ఆగస్టు 19: మామిడికుదురులో వేంచేసి ఉన్న శ్రీరుక్మిణి సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీలక్ష్మీహైగ్రీవ జయంతి సందర్భంగా పది వేల పెన్నులతో పూజా కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా చేశారు. సుదర్శనం వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విశ్వక్షేణ ఆరాధన, పుణ్యాహవచనం, పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

● కెమెరా సృష్టికర్త లూయిస్ డాగూరేకు ఘన నివాళి ● ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని వినతి ● పలు సేవా కార్యక్రమాలు నిర్వహణ




అమలాపురం, ముమ్మిడివరంలలో ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగూరేకు పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఫొటోగ్రాఫర్లు

అమలాపురం, ఆగస్టు 19: 185వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అమలాపురం ఫొటోగ్రఫీ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్, ధనరాజు, కాజాబాబు, తాతాజీ, రమణ, నగేష్, రాజు, బాస్కర్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ ఫొటో గ్రాఫర్స్ దినోత్సవాన్ని జరుపుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు చప్పిడి రాజేష్ సారధ్యంలో డాగురే చిత్రపటానికి ఫొటో గ్రాఫర్లు నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించి ఫొటో గ్రాఫర్స్‌డే వేడుకలను జరుపుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కాకి మాణిక్యం, చింతా వెంకటేష్, గుత్తుల నాగు, కముజు శ్రీనివాసరావు, గాలిదేవర సత్తిబాబు, వల్లభరెడ్డి పాపారావు, వీడియో గ్రాఫర్స్ నలమాటి శివ, గోపి, రమేష్, ప్రసాద్, రామకృష్ణ, కృష్ణారావు, రమణ, శేఖర్, రాంబాబు, నాగరాజు, కె.ప్రసాద్, భద్రం అరుణ్,ఫొటో, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం గొల్లవిల్లిలో ది లూయిస్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చోడిశెట్టి ఆదినారాయణ, బొక్కా పుల్లంశెట్టి, మట్టపర్తి సురేష్, దేవదాసు రాజేష్, దేవరపల్లి శ్రీనివాసరావు, మోసుగంటి ప్రసాద్, జంగా రవికుమార్, అంబటి వెంకటేశ్వరరావు, దోనిపాటి రాంబాబు, సూదా వెంకటరత్నం, కుంచే బుజ్జిబాబు, పోలినాటి భీమేశ్వరరావు పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): 185వప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం రామచంద్రపురంలో వి.కె.స్టూడియో వద్ద ఘనంగా నిర్వహించారు. రామచంద్రపురం జోన్ ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కెమెరా సృష్టికర్త జాక్వెస్‌మాండే డాగురే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గాదం మధుసూదనరావు, కార్యదర్శి సుంకర వెంకన్న, గౌరవ అధ్యక్షుడు ముచ్చుమిల్లి దుర్గారావు, అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దిరెడ్డి వరప్రసాద్ (నాని), జిల్లా ఉపాధ్యక్షుడు వి.కె.బాలకృష్ణ, కుడుపూడి రమణ, పుల్లయ్య, అధిక సంఖ్యలో వీడియో, ఫొటో గ్రాఫర్లు పాల్గొన్నారు.

మలికిపురం: ఫొటోగ్రఫీ అసోసియేషన్ మలికిపురం మండలఅధ్యక్షుడిగా నేల శ్రీనివాస్, కార్యదర్శిగా దాసంశెట్టి కేశవ, ఉపాధ్యక్షుడిగా ఆకుల గోవిందరాజు, కోశాధికారిగా దొంగ మోహన్, సహాయ కార్యదర్శిగా చెల్లుబోయిన అర్జున్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. గౌరవ అధ్యక్షుడుగా కేఎస్‌వీ ప్రసాద్, గౌరవ సలహాదారుడిగా సీవీ రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా మదర్‌థెరిస్సా కళాశాల వద్ద జరిగిన సభలో జిల్లా ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడు గెడ్డం సురేష్ కుమార్ మాట్లాడుతూ ఫొటో గ్రాఫర్లను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో బి.వీరేంద్రకుమార్, సీవీ రావు, ఖ్వాజా బాబు, పడాల రామిరెడ్డి, ప్రభాకర్, కంచి ప్రసాద్, భాను రాజా, శరణ్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు వద్ద ది కోనసీమ ఫొటో గ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో డాగూరే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తోట రామకృష్ణ, నల్లా పెద్దకాపు, కర్రి బాబూరావు, సభ్యులు కొక్కిరి కిరణ్, బొంతు రమేష్, బాలాజీ, కదలి శ్రీని వాసరావు, కిరీటి, తామరపల్లి రాజా, షేక్ దొరబాబు, చైతన్య, మెల్లం వెంకటేశ్వరరావు, ఉమా, కదలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మామిడికుదురు: ఫొటోగ్రాఫర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఫొటోగ్రాఫర్ల మండల సంఘం సభ్యులు కోరారు.డాగూరే చిత్రపతానికి పూలమాలలు వేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటి, హీరు, అభిమాన్యు సుబ్బారావు, శ్రీను, నూకరాజు, పుల్లారావు, రవి పాల్గొన్నారు.

అంతర్వేది: 185 ప్రపంచ ఫొటోగ్రాఫర్స్ డేను సఖినేటిపల్లి మండలం ప్రొఫెషనల్స్ ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుంగా కుమార్, సీహెచ్ కిషోర్, స్టాలిన్, పాలపర్తి శేఖర్, ఏసుబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాయవరం: గతించిన ప్రతి జ్ఞాపకాన్ని ఒక మధుర జ్ఞాపకంగా చూపించేది ఫొటోగ్రఫీ మాత్రమేనని సూరారెడ్డి నర్సింగ్‌హోం అధినేత డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి అన్నారు. రాయవరం ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక కల్యాణ మండపంలో ఫొటోగ్రాఫర్స్ డే నిర్వహించారు. వృద్ధులకు చీరలు, విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. సీనియర్ ఫొటో గ్రాఫర్స్ చిట్టూరి దుర్గాప్రసాద్, వేదరాజు, వీఎల్‌గంగాధర్ రావు, సలుమూరి వెంకటేశ్వరరావు దంపతులను వైద్యుడు, యూనియన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. యూనియన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, కార్యదర్శి ఎంవీవీ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అంబాజీపేట: అంబాజీపేటలో ఫొటోగ్రఫీ రూపకర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి ఫొటోగ్రాఫర్లు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పతాకాన్ని ఎస్ఐ కె.చిరంజీవి ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్ లూటుకుర్తి సాయిబాబును సత్కరించారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ మండల గౌరవ అధ్యక్షుడు గుమ్మడి రాజు, అధ్యక్షుడు గంటా వెంకటగిరి, ప్రతాప్, ఏ.ప్రసాద్, శంకర్, తాతాజీ, రమణ, మణికంఠ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ బంధానికి ప్రతీక రాఖీ పండుగ



ముమ్మిడివరంలో అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లి



ఐ.పోలవరం: అన్నయ్య డ్రైవర్‌కు రాఖీ కడుతున్న చెల్లి

అమలాపురంటౌన్, ఆగస్టు19: అమలాపురం బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబుతో పాటు పలువురు ప్రముఖులకు ఓంశాంతి కేంద్రం నిర్వాహకులు బీకే శ్రీదేవి, బీకే స్వరూప ఆధ్వర్యంలో రక్షాబంధనాలు కట్టారు. ఓంశాంతి కేంద్రం ఆధ్వర్యంలో మిఠాయిలు పంచారు.

ఆలమూరు: ఆలమూరులోని సిద్ధార్థ పాఠశాలలో సోమవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కె.ముల్లారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అల్లవరం: అన్నాచెల్లెలు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా మండలంలో రాఖీపౌర్ణమి వేడుకలు జరుపుకున్నారు. రాఖీలు కట్టి సోదర, సోదరీమణులు బంధాలను చాటుకున్నారు. నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలో రక్షా బంధన్ వేడుకలను నిర్వహించారు. ర్యాలిలో కప్పల వారి కుటుంబ సభ్యులంతా ఒకచోట చేరి రక్షాబంధన్ నిర్వహించుకున్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో రాఖీ పండుగను సోమవారం జరుపుకున్నారు. కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ అండగా ఉండాలంటూ చెల్లెలు అన్నకు, అక్క తమ్ముడుకు రాఖీలు కట్టారు. స్వీట్స్ తినిపించుకుని ఆనందాన్ని పంచుకుంటూ సోదర భావాన్ని చాటుకున్నారు.

మలికిపురం: శ్రావణ పౌర్ణమిసందర్భంగా గ్రామాల్లో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. దేవాంగ సామాజిక వర్గీయులు చౌడేశ్వరి పూజలుచేసి అన్నదానం నిర్వహించారు.

మండపేట: మండపేట పట్టణం, మండలంలో రాఖీ పండుగను జరుపుకున్నారు. స్థానికబ్యాంకు కాలనీకి చెందిన ఓం శాంతి ఆశ్రమ నిర్వాహకులు పట్టణంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులకు రాఖీలు కట్టి రక్షబంధన్ శుభాకాంక్షలు తెలిపి మిఠాయిలు పంచారు. స్థానిక సంఘం కాలనీ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులు రాఖీ పండుగను జరుపుకున్నారు.

అంబాజీపేట: అన్నచెల్లెలు, అక్కా తమ్ముళ్ల బంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమిని వాడవాడలా సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. తమ్ముళ్లకు అక్క, అన్నయ్యలకు చెల్లెలు రాఖీలు కట్టి తన బంధాన్ని చాటుకున్నారు. అనంతరం రాఖీ కట్టిన వారికి బహుమతులు అందచేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆలయాలు కిటకిటలాడాయి.

రావులపాలెం: అన్నాచెల్లెలు పవిత్రంగా భావించే రాఖీ పౌర్ణమిను ఘనంగా నిర్వహించారు. మండలంలో రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని అన్నదమ్ములకు, అక్క తమ్ముళ్లకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తపేట: అన్నాచెల్లెలు, అక్కా తమ్ముడు ఆత్మీయ బంధానికి ప్రతీకగా జరుపుకునే రాఖీ పండుగను మండలంలో నిర్వహించారు. సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలపగా సోదరులు మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. స్వీట్లు తినిపించుకుని వేడుక జరుపుకున్నారు.

ఐ.పోలవరం: రక్షాబంధన్ వేడుకల్లో భాగంగా విధుల్లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌కు చెల్లెలు రాఖీ కట్టింది. మురమళ్ల గ్రామ మాజీ సర్పంచ్ చెయ్యేటి శ్రీనుబాబు సతీమణి కుమారి తన అన్న ఆర్టీసీ డ్రైవర్ మోర్త త్రిమూర్తులుకు రాఖీ కట్టింది.

కె.గంగవరం: మండలంలో సోమవారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రజలు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించుకున్నారు. సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి రక్షగా ఉండాలని కోరారు. మిఠాయిలు తినిపించి శుభా కాంక్షలు తెలిపారు. సోదరీమణులకు బహుమతుల అందజేశారు.

ముమ్మిడివరం: మండలంలో సోమవారం రక్షాబంధన్ వేడుకలను జరుపుకున్నారు. చెల్లెళ్లు, అక్కలు సోమవారం తమ్ముళ్లు, అన్నలకు రాఖీలు కట్టారు. రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపి వారి నుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు ధర్నా



అల్లవరంలో మాలమహానాడు ధర్నా

అల్లవరం, ఆగస్టు 19: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మండల మాలమహానాడు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నాయకులు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎంపీడీవో కృష్ణమోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈవిషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈనెల 21న వర్గీకరణకు వ్యతిరేకంగా జరిగే భారత్ బంద్‌కు ప్రైవేట్ కళాశాలలు, బ్యాంకులు, వ్యాపారులు సహకరించాలని మాలమహానాడు నాయకులు కోరారు. ధర్నా కార్యక్రమాల్లో కొనుకు బాపూజీ, నాతి శ్రీనివాసరావు, చింతా రామకృష్ణ, సాధనాల శ్రీనివాస్, పోతుల నాగరాజు, వడ్డి గంగ, పల్లి జేమ్స్, పులుసు గంటి రాజేశ్వరి, సాపే ధర్మరాజు, బళ్ల శ్యామ్, గోసంగి వెంకటేశ్వరరావు, వడ్డి వెంకటేష్, పరమట శ్రీను పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

కొత్తపేట, ఆగస్టు19: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా ఈనెల21న జరిగే భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని అడా ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు కోరారు. సోమవారం స్థానిక మండల ఎస్సీ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్తక, వ్యాపార, ప్రైవేటు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు బంద్‌కు సహకరించాలని కోరారు. నెల్లి లక్ష్మీపతి, బూసి భాస్కరరావు, మోర్త వెంకటేశ్వరరావు, పల్లి దీలిప్, నల్లా రమణ, మాగాపు బాలకృష్ణ, ధనరాజు, బీర విజయభాస్కర్, ఎంఆర్కే పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల21న చేపట్టే బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు ముమ్మిడివరం జేఏసీ పిలుపునిచ్చింది. మాలమహానాడు, జేఏసీ కార్యకర్తలు, విద్యార్థులు, మహిళలు, వ్యాపారులు, ప్రజా ప్ర తినిధులు బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బంద్‌కు వ్యాపారులు, విద్యాసంస్థలు, హోటల్స్ చాంబర్ ఆఫ్‌కామర్స్ సహకరించాలని నిర్వాహకులు కోరారు.

కుక్కల కాటుకు ఆవుదూడ బలి



ఉప్పలగుప్తం, ఆగస్టు 19: ఆదివారం రాత్రి ఆరు నెలల ఆవుదూడను కుక్కలు చంపేశాయి. ఉప్పలగుప్తం పంచాయతీ చీకట్లపాలెంలో సలాది శ్రీనివాసరావుకు చెందిన ఆవుదూడ మెడ వద్ద, ఇతర భాగాల్లోనూ వీధి కుక్కలు కరిచి తీవ్రంగా గాయపరిచాయి. కొట్టుకుంటున్న దూడకు చికిత్స చేయించేందుకు యజమాని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. పశువైద్యాధికారి నాగేశ్వరరావు ఆవుదూడ చనిపోయినట్టు ధ్రువీకరించారు. కుక్కలను చంపించే అధికారం పంచాయతీకి లేదని, కుక్కల నియంత్రణకు కుటుంబ నియంత్రణ పద్ధతులను అమలు చేయడమే పరిష్కారమని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ తిక్కిరెడ్డి రామకృష్ణ తెలిపారు.

పెండింగ్ జీతాలు కోసం ఆందోళన

యానాం, ఆగస్టు 19: యానాం మున్సిపాలిటీ ద్వారా ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్న హెచ్ఆర్ స్క్వేర్ సంస్థకు చెందిన సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆందోళనకు దిగారు. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం సమీపంలో సోమవారం విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. పోలీసులు, హెచ్ఆర్ స్క్వేర్ ప్రతినిధులు వారితో చర్చించారు. జీతాలు చెల్లి స్తామని హామీ ఇవ్వడంతో సిబ్బంది ఆందోళన విరమించారు.

సార్వా రైతులకు సాగునీటి కష్టాలు



అధికారులకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

ఆలమూరు, ఆగస్టు19: మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు చేపట్టిన వరి సాగు తీవ్ర దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటుంది. పంట వరి కంకులు దశలోనే రైతులు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి మండలంలోని అన్ని గ్రామాల్లోను ఇదే పరిస్థితిలో ఉండటం రైతుల దుస్థితికి అద్దం పడుతుంది. ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలోను, ఇరిగేషన్ శాఖ కార్యాలయంలోను సోమవారం పినపళ్లకు చెందిన పలువురు రైతులు ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కొత్త కాలువ, వరహాకాలువ, వెదురుమూడి తదితర కాలువల్లోకి సాగునీటిని అధికారులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి తోడు పంట కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల సాగునీటి ప్రవాహం ఎక్కడికక్కడే ఆగిపోతుందని ఆవేదన చెందారు. వర్షాకాలంలో నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. సాగునీటి విడుదలలో సత్వర న్యాయం చేయకపోతే పంటలను వదిలేసుకునే పరిస్థితి తలెత్తుతుందని వినతి పత్రంలో పేర్కొన్నారు.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకే శిక్షణ

అమలాపురంటౌన్, ఆగస్టు 19: వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకే శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఏ.మధుసూదనరావు చెప్పారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం వి.విజయలక్ష్మి అధ్యక్షతన సోమవారం పాఠశాల సముదాయ శిక్షణతో తరగతి బోధన మరింత మెరుగు కార్యక్రమాన్ని నిర్వహించగా ఏపీడీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు పాఠశాల సమావేశాలు నిర్వహించి శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మారుతున్న పాఠ్య పుస్తకాలకు అనుగుణంగా లెసన్ ప్లాన్ తయారు చేసుకోవాలని, టీచ్ టూల్‌పై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. శిక్షణలో కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బొరుసు వీవీ సుబ్రహ్మణ్యం, ఏపీవో ఏంఎకే భీమారావు, ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి, కేవీవీ సత్యనారాయణ, సాయిశ్రీనివాస్, బీవీఎస్ పోలిశెట్టి, అనూష తదితరులు పాల్గొన్నారు.

పీఠంలో ఘనంగా శ్రావణ పౌర్ణమి పూజలు

రాయవరం,ఆగస్టు19: వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రావణ పౌర్ణమి పూజలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వ ర్యంలో తొలుత విజయ వేంకటేశ్వరస్వామికి తులసిదళ అర్చ నలు, భవాని శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకాలు జరిపారు. విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి దుర్గాఅష్టోత్తర, లలితాఅష్టోత్తర, సహస్రనామాలు, లక్ష్మి, సరస్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవార్ని దర్శించుకుని పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. విజయదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు. సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెద్దపాటి సత్యకనకదుర్గ, పీఆర్వో బాబి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్ల పూజలు

ఆత్రేయపురం, ఆగస్టు 19: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతంపలికింది. వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. స్వామివారి పవిత్రాలను అర్చకులు ఆయన మెడలో వేశారు. స్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి తాడేపల్లిగూడేనికి చెందిన మారిశెట్టి పోతురాజు-సునీత దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,86,305 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం స్వామివారి హుండీ కానుకలను లెక్కిస్తామన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం పరుచుకోవాలి

రావులపాలెం, ఆగస్టు 19: రావులపాలెం సత్యసాయి కళాశాల క్రీడా ప్రాంగణంలో ఈనెల21న నిర్వహించబోయే జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ యువ నాయకులు బండారు సంజీవ్ అన్నారు. టీడీపీ తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మండల శాఖ అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, ఇతర నాయకులతో కలిసి సోమవారం సంజీవ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో వికాస నిర్వహించే జాబ్‌మేళాకు హెచ్‌పీఎల్, టెక్ మహేంద్ర, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 2025 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బి.టెక్, పీజీ చదివిన నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చనన్నారు. ముందుగా రిజిస్ట్రేషన్ కోసం 7799376111 నెంబరు సంప్రదించాలని సూచించారు.

705 పోస్టుల భర్తీకి అమలాపురంలో జాబ్‌మేళా

అమలాపురం టౌన్, ఆగస్టు 19: ప్రముఖ ప్రైవేటు కంపెనీల్లో 705 పోస్టుల భర్తీకి ఈనెల22న అమలాపురంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారిణి ఇ.వసంతలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయం వద్ద ఉదయం 10.30గంటల నుంచి జాబ్‌మేళా జరుగుతుందన్నారు. తిరుపతి అమర్‌రాజా గ్రూపు కంపెనీలో 300 మెషీన్ ఆపరేటర్ పోస్టులు, కోనసీమ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 105 సేల్స్ ఆఫీసర్స్ అండ్ ఏఎస్ఎం పోస్టులు, క్వెస్ క్రాప్ ఎస్బీఐ కార్డ్స్‌లో 300బ్రాంచ్ రిలేషన్‌షిప్ పోస్టులు భర్తీ జరుగుతుందన్నారు. అభ్యర్థులు 18-35ఏళ్ల వయస్సు, పదోతరగతి, ఐటీఐ ఆపైన విద్యార్హత ఉండాలన్నారు. వేతనం 11-22 వేల మధ్య ఉంటుందన్నారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు సర్టిఫికెట్ల నకళ్లు తీసుకురావాలన్నారు. వివరాలకుసెల్:8121838392ను సంప్రదించాలన్నారు.

ఘనంగా వెంకన్న జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం, ఆగస్టు 19: అంగరలో కొలువైయున్న శ్రీఅలివేలు మంగ గోదాదేవి సమేత శ్రీవైభవ వెంకటేశ్వరస్వామి వారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం పూజలు సోమవారం జరిగాయి. ఆలయ అర్చకుడు కె.బాలబాలాజీ అచార్యులు ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు స్వామివార్ని ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం శ్రవణా నక్షత్రం పూజలు, అభిషేకాలు, కలశపూజ, విశేష పూజలను వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించాలని వినతి

కపిలేశ్వరపురం, ఆగస్టు19: అంగరలో డంపింగ్‌యార్డ్ సమస్యను పరిష్కరించాలని గ్రామానికి చెందిన పలువురు అమలాపురంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీవాసులు, పీహెచ్‌సీకి వచ్చే రోగులు, సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారని, సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరినట్లు ఎస్ఎంసీ ఛైర్మన్ జీకె. జానకిరాముడు, చల్లాబత్తుల లోవరాజు, డి.శరత్, చెవ్వూరి త్రినాథ్‌స్వామి తెలిపారు.

యానాం స్టోర్స్ ఎన్నికలకు 24నామినేషన్లు దాఖలు

యానాం, ఆగస్టు 19: యానాం కోఆపరేటివ్ స్టోర్స్‌కు సంబంధించి నూతన పాలకవర్గం ఎన్నికకు సోమవారం నామినేషన్లు దాఖలు చేశారు. సాయంత్రం గడువు ముగిసేనప్పటికి 24మంది నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్టు ఎన్నికల అధికారి తెలిపారు. స్థానిక విష్ణాలయం వీధిలోని స్టోర్స్ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియ కొనసాగింది. మొత్తం 3,537మంది సభ్యులుండగా 3,526మందితో తుది జాబితాను ఇప్పటికే ప్రకటించారు. 9మంది డైరెక్టర్లను సభ్యులు ఎన్నుకుంటారు. మంగళవారం నామినేషన్లు పరిశీలన చేస్తారు. 21న నామినేషన్లు ఉపసంహరణ అనంతరం తుది జాబితాను ప్రకటిస్తారు. ఈనెల28న పోలింగ్ నిర్వహించి అదేరోజు ఫలితాలు ప్రకటిస్తారు. 24నామినేషన్లలో 14మంది జనరల్ కేటగిరి, 5గురు మహిళలు, 5గురు ఎస్సీ కేటగిరిలో నామినేషన్లు దాఖలు చేశారు.

స్త్రీ, శిశుసంక్షేమశాఖలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

ముమ్మిడివరం, ఆగస్టు 19: జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారిత శాఖలో నాన్‌స్టాప్ సెంటరులో కాంట్రాక్టు పద్ధతిలో ఏడాది పని చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి డాక్టర్ ఝాన్సీరాణి చెప్పారు. సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్(మహిళ), కేస్‌వర్కర్ రెండు పోస్టులు, (మహిళ) పారా లీగల్ పర్సనల్ (మహిళాన్యాయవాది), పారామెడికల్ పార్మసీ(మహిళ), సైకోసోషల్ కౌన్సిలర్(మహిళ), ఆఫీస్ అసిస్టెంట్ విత్ కంప్యూటర్‌నాలెడ్జీ, మల్టీపెన్షన్ స్టాప్‌సెక్యూరిటీ 3పోస్టులు, సెక్యూరిటీగార్డు మహిళమూడు పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నా మన్నారు. 2024జూలై1నాటికి 25ఏళ్లనిండిన వారు దరఖాస్తులను వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ఈనెల30వతేదీలోపు దరఖాస్తులు ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోనిజిల్లా కార్యాలయంలో అందజేయాలన్నారు.

కొమ్మూరి కుటుంబానికి ప్రముఖుల పరామర్శ



అల్లవరం, ఆగస్టు19: ఇటీవల కొమర గిరిపట్నానికి చెందిన కొమ్మూరి సత్యనారాయణ మృతిచెందారు. ఆయన చిత్రపటంవద్ద నివాళులర్పించారు. ఆయన సోదరులను పలువురు పరామర్శించారు. టీడీపీ మండలఅధ్యక్షుడుదెందుకూరి సత్తిబాబురాజు, మంతెన సురేష్‌రాజు, దాట్ల గోపిరాజు, కడలి విజయ్, బళ్ల సత్యనారాయణ, ఆకుల బాపన్న నాయుడు, ఆకుల నాగశ్రీను, పోతుల నాగరాజు, మున్సిపల్‌వైస్‌చైర్మన్ రుద్రరాజు నానిరాజు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గునిశెట్టి చినబాబు, అల్లూరి సురేష్‌రాజు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈజీఎస్ గ్రామసభలు నిర్వహించాలి

ఆత్రేయపురం, ఆగస్టు 19: గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామసభలు సత్వరమే నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారని ఎంపీడీవో నాతి బుజ్జి చెప్పారు. సోమవారం వెలగపూడి అమరావతిలో పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యభూషన్‌కుమార్, కమిషనరు ఎం.కృష్ణతేజ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారని చెప్పారు. ఈనెల23 నుంచి అన్ని గ్రామాల్లో ఉపాధి గ్రామసభలు నిర్వహించి గ్రామాల్లో అవసరమైన పనులు గుర్తించాలని ఆదేశించారన్నారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్, ఏపీవో విజయభారతి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీధర్, పశువైద్యాధికారి రామయ్యచౌదరి పాల్గొన్నారు.

సెప్టెంబరు 14న రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురంటౌన్, ఆగస్టు19: అమలాపురంహెల్త్‌అండ్‌ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 14,15తేదీల్లో రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు కోనసీమ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు యెనుమల కృష్ణపద్మరాజు, కార్యదర్శి వంటెద్దు వెంకన్నాయుడు తెలిపారు. అమలాపురం దుడ్డువారిఅగ్రహారంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో పోటీలు జరుగుతాయన్నారు. పోటీలకు మెట్రోకెంఅధినేత నందెపు వెంకటేశ్వరరావు(బాలాజీ)స్పాన్సర్‌షిప్ అందించడంతో సోమవారం లిఫ్టింగ్ అసోసియేషన్‌సభ్యులు ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బుజ్జి, ఎం.విసముద్రం, సీహెచ్‌రాజబాబు, ఎం.వీరేంద్ర, బి.యశ్వంత్, పి.వందన, జిమ్‌కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మురమళ్లలో చండీహోమం

ఐ.పోలవరం, ఆగస్టు19: శ్రావణపూర్ణిమ సందర్భంగా సోమవారం మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గణపతి పూజ, మండపారాధన, చండీహోమం, పూర్ణాహుతి జరిగాయి. సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆకొండి కిరణ్ పాల్గొన్నారు.

వికనస స్వామి జయంతి

అంతర్వేది, ఆగస్టు 19: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని ఉపఆలయంలో వేంచేసియున్న వికనస మానవముని జయంతి సందర్భంగా వికనస స్వామివారికి అభిషేకం, రుద్రనామర్చన, పరమాధ్యికోపనిస్త్ పారాయణ, విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగే నిత్యపూజలు, సేవలు, ఉత్సవాలు, దేవాలయ నిర్మాణం దగ్గర నుంచి విగ్రహం తయారీ ప్రతిష్ట, అర్చన, మొదలైన విధివిధానాలన్నీ వికనస ఆగమ శాస్త్రాన్ని అనుసరించి జరుగుతాయని పండితులు తెలిపారు. ఈశాస్త్రాన్ని అందించిన వికనస మహర్షి జన్మదినమే వికనస జయంతి అని తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ మున్సిపల్ వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు



మండపేట, ఆగస్టు 19: వైసీపీకి చెందిన మండపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, మలసాని సీతారత్నం సోమవారం తెలుదేశం పార్టీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వారిని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు టీడీపీలోకి ఆహ్వానించారు. కౌన్సిలర్లతో పాటు వారి అనుచరగణం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే వేగుళ్ల, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గడి రాంబాబు, నల్లమల్లి వీర్రెడ్డి, కుక్కల రామారావు, వాదా ప్రసాదరావు, టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి, నామాల చంద్రరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇసుకర్యాంపులు నిలుపుదల చేయండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 19: ఎన్జీటీ ఉత్తర్వులకు వ్యతిరేకంగా కె.గంగవరం మండలం మసకపల్లి, కోట, భట్లపాలిక, కాజులూరు మండలం పెదలంక గ్రామాల్లో అనుమతి లేకుండా ఇసుక తవ్వుతున్న ర్యాంపులను నిలుపుదల చేయించాలని సోమవారం గ్రీవెన్స్‌లో యర్రంశెట్టి రామరాజు సోమవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఇసుక అక్రమ తవ్వకాలపై హైకోర్టులో వ్యాజ్యం వేసినట్టు చెప్పారు.

బొబ్బట్ల తయారీ కేంద్రంపై విజిలెన్స్ తనిఖీలు

కొత్తపేట, ఆగస్టు 19: కొత్తపేట కౌశికరోడ్డులో దుర్గా గణేష్ స్వీట్ షాపు పేరిట నిర్వహిస్తున్న బొబ్బట్ల తయారీ కేంద్రంలో సోమవారం సివిల్ సప్లై, విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లు వాడుతున్నట్లు గుర్తించారు. దీనిపై ఏడు డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేసి శ్రీనివాస్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. షాపు యజమానిపై 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు, ఏఎస్వో శ్రీనివాస్, కిషోర్, బుజ్జిబాబు ఉన్నారు.

తాడిచెట్లు నరకడంపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

అంతర్వేది, ఆగస్టు19: తహశీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తాడిచెట్ల నరికివేతపై తహసీల్దారు సీహెచ్‌నాగలక్ష్మి మ్మకు ఎంపీపీ వీర మల్లిబాబు వినతిపత్రాన్నిఅందించారు.

గొంది కార్యదర్శిగా గంగరాజు

అంతర్వేది, ఆగస్టు 19: గొంది పంచాయతీ కార్యదర్శిగా అడబాల గంగరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వీవీ మెరక కార్యదర్శి ఎస్ఆర్‌కే రాజు, పంచాయతీయ సిబ్బంది బాబి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే వీవీఎస్ఎస్ చౌదరి జయంతి వేడుకలు

మండపేట, ఆగస్టు 19: ఆలమూరు మాజీ ఎమ్మెల్యే వీవీఎస్ఎస్ చౌదరి 85వ జయంతిని పట్టణంలోని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకుడిగా, ఎమ్మెల్యేగా చౌదరి చేసిన సేవా కార్యక్రమాలను అభిమానులు గుర్తుచేసుకున్నారు. అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం చౌదరి చిత్రపటానికి కొప్పాక సత్యనారాయణ (విజ్ఞాన్ బాబి), బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ, ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యంబుద్రి, పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థుల భారీ ప్రదర్శన

రామచంద్రపురం(ద్రాక్షారామ): కోల్‌కతాలో వైద్య విద్యార్థిని అత్యాచార ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సోమవారం టీమ్ సుభాష్ ఆధ్వర్యంలో పట్టణంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థినులు భారీ నిరసన ప్రదర్శన జరిపారు. వికాస్ జూనియర్, డిగ్రీ కళాశాల, మోడరన్ విద్యాసంస్థలు, వీఎస్ఎం, ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

మామిడికుదురు: వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన మానవమృగాలను ఉరి తీయాలని మామిడికుదురు దీప్తి కళాశాల విద్యార్థులు నిరసన చేపట్టారు.మామిడికుదురు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. నగరం పోలీస్‌స్టేషన్‌లో, తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.వి.వి.సత్యనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.